సాక్షి ఒడిశా

ఆదివారం । 27 । ఏప్రిల్ । 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు : రూ. 5.33.410

వెండి : 18 గ్రాముల 200 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



కృష్ణచంద్ర గజపతికి నివాళి

కృష్ణచంద్ర గజపతి జయంతి వేడుకగా జరిగింది. ఆయన సేవలు గుర్తు చేసుకున్నారు.

– IIలో



గిరిజనుల వేడుకలు

నాగేశ్వరి గుహలపై గిరిజనులు వేడుక చేశారు. నృత్యాలు చేసి సందడి చేశారు.

– IIలో

న్యూస్‌రీల్

బాలాసోర్‌లో జాతీయ దర్యాప్తు బృందం

భువనేశ్వర్: జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) బృందం రాష్ట్రంలో బాలాసోర్‌కు చేరుకుంది. పహల్గామ్ ఉగ్రవాద దాడిలో మృతుడు ప్రశాంత్ శత్పతి ఇంటికి ఆ బృందం శనివారం వెళ్లింది. ప్రశాంత్ శత్పతి తన భార్య, కొడుకుతో కలిసి పహల్గామ్‌లో సెలవులో ఉన్నప్పుడు ఉగ్రవాదులు అతడిని కాల్చి చంపారు. ఈ ఘటనపై దర్యాప్తు చేయడానికి ఎన్ఐఏ బృందం బాలాసోర్ జిల్లా ఇషాణీ గ్రామానికి చేరుకుంది. ఈ బృందం ఈ ఘటన గురించి ప్రశాంత్ భార్యతో మాట్లాడి వివరాలు సేకరించనుంది. ఈ దారుణం జరిగిన సమయంలో పరిస్థితి గురించి అధికారులకు పటిష్టమైన అవగాహన కూడగట్టుకునే దిశలో దర్యాప్తు బృందం సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.

కటక్‌లో ముగ్గురు పాకిస్తానీయులు

భువనేశ్వర్: కటక్‌లో ముగ్గురు పాకిస్తాన్ జాతీయులు ఉన్నట్లు గుర్తించారు. పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి ప్రభావంతో భారత దేశం నుంచి పాకిస్తాన్ జాతీయులను బహిష్కరించాలని భారత ప్రభుత్వం ఆదేశించిన విషయం తెలిసిందే. వివిధ రకాల వీసాలపై పాకిస్తానీయులు మన దేశానికి వచ్చారు. కమిషనరేట్ పోలీసులు చేపట్టిన గుర్తింపు ప్రక్రియలో రాష్ట్రంలో పలు చోట్ల స్థిరపడి ఉన్న పాకిస్తానీయుల్ని గుర్తించడంలో తలమునకలై ఉన్నారు. ఈ నేపథ్యంలో కటక్ ప్రాంతంలో తాజాగా ముగ్గురు పాకిస్తాన్ జాతీయుల్ని గుర్తించి కేంద్ర హోం శాఖకు సమాచారాన్ని అందజేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. హోం శాఖ తదుపరి సూచనల ప్రకారం పోలీసులు వ్యవహరిస్తారు. ఒక పాకిస్తానీ మహిళ 2008 నుంచి దీర్ఘకాలిక వీసాపై భువనేశ్వర్‌లో నివసిస్తోంది. సంబంధిత పాకిస్తానీ మహిళ వీసా 2024లో గడువు ముగిసింది. ఆ మహిళ భారత దేశం విడిచి పాకిస్తాన్ వెళ్లడానికి ఎగ్జిట్ పర్మిట్ కోసం కమిషనరేట్ పోలీసులకు దాఖలు చేసిన దరఖాస్తును అప్పట్లో తిరస్కరించారు. అయితే పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత పాకిస్తానీయులు అందర్నీ భారత దేశం విడిచి వెళ్లాలని ఆదేశించిన నేపథ్యంలో పోలీసులు ఆ పాకిస్తానీ మహిళకు భువనేశ్వర్ విడిచి వెళ్లాలని నోటీసు జారీ చేశారు.

రాష్ట్రంలో 12 మంది పాకిస్తానీయులు ఉన్నారని పోలీసు వర్గాలు సమాచారం జారీ చేసిన విషయం విదితమే. 48 గంటల్లోపు భారత దేశం విడిచి వెళ్లాలని వారికి నోటీసు అందిందని రాష్ట్ర పోలీస్ డైరెక్టరు జనరల్ యోగేష్ బహదూర్ ఖురానియా తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో 12 మంది పాకిస్తానీ జాతీయులు ఉన్నారు. 48 గంటల్లోపు భారత దేశం విడిచి వెళ్లాలని వారికి నోటీసు అందింది అని పోలీస్ డీజీపీ తెలిపారు.

టిప్పర్ బైక్ ఢీ: ఇద్దరు మృతి



రహదారిపై గంగే పోడి యామి మృతదేహం



ప్రమాద స్థలంలో ముక సోడి మృతదేహం



పోలీసులు స్వాధీనం చేసుకున్న టిప్పర్

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కోరుకొండ సమితి పాతచిమ్మూటాపల్లి పంచాయతీ గొంపకొండ కలు మార్గంలో శనివారం మధ్యాహ్నం బలిమెల వైపు నుంచి వస్తున్న ఓ టిప్పర్ బైక్‌ను ఢీకొనడంతో కొత్తపల్లి గ్రామానికి చెందిన గంగే పోడియామి (50), ముక సోడి (30) మృతి చెందారు. ఓ పెళ్లి కోసం వీరిద్దరూ మల్కన్‌గిరి వచ్చి తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. విషయం తెలుసుకున్న ఐఐసీ హిమాంశు బారిక్ సంఘటన స్థలానికి వెళ్లి వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాలను మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మూడు దుకాణాలు దగ్ధం

భువనేశ్వర్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ప్రమాదంలో 3 దుకాణాలు దగ్ధమయ్యాయి. కోణార్క్ బస్టాండ్ దగ్గర ఈ సంఘటన చోటు చేసుకుంది. లింగరాజ్ దుకాణ సముదాయంలో అగ్ని ప్రమాదంతో లక్షల రూపాయల విలువైన నిత్య వినియోగ, సరుకులు తదితర సామగ్రి దగ్ధమైంది. శుక్రవారం రాత్రి దుకాణాలు మూసివేస్తున్న సమయంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

నల్ల పులుల పుట్టినిల్లు



సిమిలిపాల్ జాతీయ ఉద్యాన వనం ప్రధాన ప్రవేశ తోరణం



కూన సంరక్షణలో నల్ల పులి

845 చదరపు కిలోమీటర్ల స్వర్గమది. భూ మండలాన్ని కాపాడుతున్న అతి కొద్ది ప్రత్యేక ప్రాంతాల్లో ఇదీ ఒకటి. అరుదైన జంతుజాలాలు, అందమైన జలపాతాలు, విభిన్న పుష్ప జాతులు, వైవిధ్య భరిత వృక్షాలతో సిమిలిపాల్ అలరారుతోంది. అన్నింటి కంటే ముఖ్యంగా ఇది నల్ల పులుల పుట్టినిల్లు. సహజమైన అడవిలో పెద్దపులులు ఠీవిగా నడుస్తుంటే చూడడం ఓ అవ్యక్తానుభూతి. కుటీరాలతో, పసందైన భోజన వసతులతో సిమిలిపాల్ పర్యాటకులను పిలుస్తోంది. వేసవి విడిదిలో తనకూ చోటివ్వమంటూ కోరుతోంది.

- సిమిలిపాల్‌కు జాతీయ ఉద్యానవనం హోదా
- వైవిధ్యభరిత వృక్ష, జంతుజాలానికి ఆలవాలం



ప్రకృతి రమణీయతకు నిలువెత్తు సాక్ష్యాలు



దట్టమైన అటవీ పర్యావరణం మధ్య వసతి సదుపాయం

భువనేశ్వర్: పులుల స్వైర విహార కేంద్రమైన సిమిలిపాల్‌కు 45 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ అనంతరం జాతీయ ఉద్యానవన హోదా లభించింది. రాష్ట్రంలో ఇది రెండో జాతీయ ఉద్యానవనంగా స్థానం దక్కించుకోవడం విశేషం. రాష్ట్ర ప్రభుత్వం సిమిలిపాల్‌ను వన్య ప్రాణుల సంరక్షణ చట్టం, 1972 ప్రకారం జాతీయ ఉద్యానవనంగా ప్రకటించింది. ఆగస్టు 6, 1980, జూన్ 11, 1986 నాటి రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదిత సంప్రదింపులపై అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పుల శాఖ తాజాగా అధికారిక నోటిఫికేషన్ జారీ చేసింది. అన్ని చట్టబద్ధమైన విధానాలు కార్యాచరణతో నోటిఫైడ్ ప్రాంతంలోని భూమికి సంబంధించిన అంశాలను సక్రమంగా పరిష్కరించారు. ఈ నేపథ్యంలో సిమిలిపాల్ జాతీయ ఉద్యానవనం భూమిపై రాష్ట్రానికే పూర్తి హక్కులు ఉన్నాయని ప్రభుత్వం ధ్రువీకరించింది. జాతీయ ఉద్యానవనం ప్రకటించిన తర్వాత సిమిలిపాల్ పై ఎవరికీ ఎలాంటి హక్కులు ఉండవు. ప్రభుత్వానికి పూర్తి అధికారం ఉంటుంది. ప్రస్తుతం 845 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న సిమిలిపాల్ ప్రాంతంలో ఎలాంటి మానవ నివాసాలు లేవు.

పదేళ్లలో 100 పులులు

సిమిలిపాల్ జాతీయ ఉద్యానవనంలో ప్రస్తుతం 40 రాయల్ బెంగాల్ (పెద్ద) పులులు ఉన్నాయి. వాటిలో ఆరు పిల్లలు కూడా ఉన్నాయి. జీనత్, యమునల విజయవంతమైన సంతానోత్పత్తితో ఈ వృద్ధి సాధ్యమైందని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (వైల్డ్ లైఫ్) ప్రేమ్ కుమార్ ఝా తెలిపారు. ఈ ఉద్యానవనంలో 13 వయోజన మగ పులులు, 17 ఆడ పులులను గుర్తించారు. మరో 2 వయోజన పులుల లింగ నిర్ధారణ కాలేదు.

18 మెలనిస్టిక్ రాయల్ బెంగాల్ టైగర్లు

సిమిలిపాల్ జాతీయ ఉద్యానవనంలో అడుగడుగున వైవిధ్యభరితమైన జంతు జాలం కనిపిస్తూ ఉంటుంది. ప్రధానంగా నల్ల పులుల సంతతికి ఈ ఉద్యానవనం పుట్టినిల్లుగా భాసిల్లుతోంది. ఇక్కడ 18 నల్ల పులులు (మెలనిస్టిక్ రాయల్ బెంగాల్ టైగర్లు) ఉండటం విశేషం. ఇది సిమిలిపాల్‌లో మాత్రమే కనిపించే అరుదైన జన్యు వైవిధ్యం. వీటిలో 9 మగ, 9 ఆడ నల్ల పులులు ఉన్నాయి. ఈ ప్రత్యేక జాతుల ఉనికి పార్క్ జీవ వైవిధ్యాన్ని పెంచడమే కాకుండా దాని ప్రపంచ పర్యావరణ ప్రాముఖ్యతను కూడా పెంచుతుంది. రానున్న పదేళ్లలో సిమిలిపాల్ జాతీయ ఉద్యానవనంలో పులుల సంతతి 100కి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారి తెలిపారు. ప్రపంచంలో అంతరించిపోతున్న పెద్ద పులి జాతుల సంరక్షణకు సిమిలిపాల్ ఆదర్శప్రాయం అవుతుంది.

ఏడాది పొడవునా పర్యటన సందడి

వర్షాకాలం మినహా ఏడాది పొడవునా పులుల అభయారణ్యంగా పేరొందిన సిమిలిపాల్ సందర్శకుల్ని ఆహ్వానిస్తుంటుంది. సాధారణంగా ఏటా నవంబర్ 1 నుంచి జూన్ 15 వరకు నిరవధికంగా తెరిచి ఉంటుంది. అత్యవసర పరిస్థితుల్లో ఉద్యానవనం మూసివేత, తెరిచే తేదీ వివరాల్ని పత్రిక, ఎలక్ట్రానిక్ (టెలివిజన్) మీడియా ఇతరేతర సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రసారం చేస్తారు.

రోడ్డు రవాణా సౌకర్యం

జషీపూర్, బరిపద నుంచి అభయారణ్యంలోకి ప్రవేశించేందుకు రెండు ప్రవేశ ద్వారాలు ఉన్నాయి. ప్రధాన ప్రాంతాల నుంచి దూరం వివరాలు.

ప్రవేశ ద్వారం	ప్రధాన నగరాలు (కిలోమీటర్లు)				
	భువనేశ్వర్	బాలాసోర్	జంషెడ్‌పూర్	కోల్‌కతా	రాంచీ
జషీపూర్	252	156	111	290	235
బరిపద	250	56	141	220	260



వన్య ప్రాణుల సహజ జీవన శైలి



పగటి పూట సందర్శనకు అనుమతి

ఉద్యానవనం పగటి పూట సందర్శించేందుకు అనుమతిస్తారు. ఈ మేరకు ప్రత్యేక పాసులు జారీ చేస్తారు. ప్రవేశ పాసులు ఆన్‌లైన్ మోడ్ (www.similipal.org) ద్వారా లేదా ఎంట్రీ గేట్ల వద్ద ఆఫ్‌లైన్ మోడ్ ద్వారా పొందవచ్చు. సందర్శకులు జషీపూర్‌లోని కలియాణి గేట్, బరిపదలో పితాబట్టా గేట్ ద్వారా ఉద్యానవనం లోనికి ప్రవేశించవచ్చు. నిర్దేశిత షరతులతో ప్రైవేట్ వాహనాలపై పార్కులోకి ప్రవేశించేందుకు అనుమతిస్తారు.

సఫారి వాహనాల్లో సందర్శన

12 సీట్ల సామర్థ్యం గల సఫారీ వాహనాల్లో సౌకర్యవంతమైన ప్రయాణంతో సందర్శకులు ఉద్యానవనం సోయగాల్ని ఆస్వాదించవచ్చు. ఈ వాహనాలను సందర్శన రోజు ఉదయం 7 గంటలకు ఆన్‌లైన్ మోడ్ ద్వారా ముందు www.similipal.org లేదా www. ecotourodisha.com ద్వారా) లేదా ఆఫ్‌లైన్ మోడ్ ద్వారా ఎంట్రీ గేట్ల వద్ద బుక్ చేసుకోవచ్చు. ఇక్కడ చక్కటి శాకాహార, మాంసాహార వంటకాలు లభిస్తాయి. ఉద్యానవనంలో లోపల ఇతర ప్రాంతాల్లో మాంసాహార ఆహార పదార్థాలు, మద్యం నిషేధం.

డ్రోన్‌లు నిషేధం

ప్రవేశ ద్వారాల వద్ద ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ మోడ్ ద్వారా అవసరమైన అనుమతితో, నిర్ధారిత రుసుము డిపాజిట్‌తో ప్రొఫెషనల్ స్టిల్, వీడియో కెమెరాలు అనుమతిస్తారు. పార్క్ లోపల డ్రోన్‌లను అనుమతించరు.

రాత్రి బస మధుర జ్ఞాపకం

సహజమైన అడవిలో పెద్ద పులుల సంచారం నడుమ ఒక రాత్రి సేద తీరే అవకాశం సిమిలిపాల్ జాతీయ ఉద్యానవనం సందర్శకులకు అరుదైన అవకాశం. టైగర్ రిజర్వ్ లోపల తమ రాత్రి బసను ఆన్‌లైన్ మోడ్ ద్వారా మాత్రమే బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. (www.similipal.org లేదా www.ecotourodisha.com). గుర్గురియా, కుమారి, బరేహిపాని, జముని - రామతీర్థ నేచర్ క్యాంపులలో విలాసవంతమైన రాత్రి బస సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. వసతి, భోజన సదుపాయాలతో బస అడ్వాన్సు బుకింగు వీలవుతుంది.

సఫారీ మార్గాల వెలుపల పర్యాటక ప్రాంతాలు

టైగర్ రిజర్వ్ సరిహద్దు వెలుపల రామతీర్థ, లులుంగ్, సమివృక్షం, కలో ఆనకట్ట, హల్దియా ఆనకట్ట, జంభిరా ఆనకట్ట, బలిదిహా ఆనకట్ట, శంకరమార ఆనకట్ట, కాంచిండా మొదలైనవి ఇతర పర్యాటక ప్రాంతాలుగా ఆకట్టుకుంటాయి. పులుల అభయారణ్యం సరిహద్దు లోపల ఉన్న దేవ్‌కుండ్, బ్రాహ్మణకుండ్, సీతాకుండ్, నేడం ఆనకట్ట మొదలైన పర్యాటక ప్రదేశాలు వర్షాకాలంలో మూసివేస్తారు.

రైలు పర్యటన

ఉద్యానవనానికి దగ్గరగా బరిపద, ఉన్న రైల్వే స్టేషన్లు బరిపాడ, భంజ్‌పూర్, బంగిరిపోసి, బాదం పహడ్ స్థానిక రైళ్ల స్టేషన్లు ఉన్నాయి. వీటితో బాలాసోర్, టాటానగర్ (జంషెడ్‌పూర్) ప్రధాన రైలు స్టేషన్లు ఉన్నాయి. ఇవి దేశంలోని ఢిల్లీ, కోల్‌కత్తా, బెంగళూరు, చెన్నై, కోయంబత్తూరు, త్రివేంద్రం, ముంబై, పూణే, నాగ్‌పూర్, అహ్మదాబాద్ వంటి ప్రధాన నగరాలతో అనుసంధానతమై ఉన్నాయి.

ఎయిర్ టెర్మినల్స్

సమీప విమానాశ్రయాలు భువనేశ్వర్, కోల్‌కతా, రాంచీలలో ఉన్నాయి. ఈ మూడు విమానాశ్రయాల నుంచి జాతీయ, అంతర్జాతీయ విమాన యాన సౌకర్యం ఉంది.



సందర్శకుల బాటలో నల్ల పులుల స్వైర విహారం



అరుదైన నల్ల పులి



జలజల జారువారుతున్న జలపాతాలు



జింకల స్వేచ్ఛా జీవనం



సందర్శకుల తీపి జ్ఞాపకం



అపురూప పక్షి జాతి

పాల ఉత్పత్తి పెంపొందించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ బిజయ కుమార్ దాస్

పర్లాకిమిడి: జిల్లాలో పాల ఉత్పత్తి పెంపొందించేందుకు పాడి రైతులు తోడ్పాడాలని కలెక్టర్ బిజయ కుమార్ దాస్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రపంచ ప్రాణి చికిత్సా దినోత్సవాన్ని వెటర్నరీ శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. జిల్లాలో పాడి పశువులతో పాటు చేపలు, మేకలు, గొర్రెలు, కోళ్ల ఫారంలు ఏర్పాటు చేయాలని సూచించారు. ముఖ్య పశువైద్యశాఖ అధికారి రమాకాంత రోణా మాట్లాడుతూ.. పశువుల్లో సాధారణంగా వచ్చే వైరస్ వ్యాధులు అరికట్టేందుకు పశువైద్య మిత్రా కార్యకర్తలను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సెంచూరియన్ వర్సిటీ వెటర్నరీ డీన్ గిరీష్ మహంతి, వాటర్ షెడ్ డిపార్ట్‌మెంట్ అధికారి సురేష్ పట్నాయక్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్య నిర్వహణ అధికారి శంకర్ కెరకెటా, ఐటీడీఏ పీవో అంశుమాన్ మహాపాత్రో, జిల్లా ఉద్యానవన శాఖ డిప్యూటీ డైరక్టర్ సుశాంత్ కుమార్ దాస్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, పాడి రైతులు

బలహీన వర్గాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి



ప్రసంగిస్తున్న నబరంగ్‌పూర్ ఎంపీ బలభద్ర మజ్జి

కొరాపుట్: బలహీన వర్గాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని నబరంగ్‌పూర్ ఎంపీ బలభద్ర మజ్జి అన్నారు. కొరాపుట్ జిల్లా కేంద్రంలోని ట్రైబల్ మ్యూజియంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలపై జరిగిన సదస్సులో బీజేపీ కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. పేద బలహీన వర్గాలు సమాజంలో సమానత్వం సాధించడానికి అప్పట్లో అంబేడ్కర్ ఆలోచన చేశారన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రత్న భాండాగారం పనులు నిలిపివేత



ఉన్నత స్థాయి సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: ప్రపంచ ప్రఖ్యాత దైవిక చతుర్ధామూర్తుల రథయాత్ర జరిగే వరకు రత్న భాండాగారం మరమ్మతుల పనులు నిలిపివేయాలని శ్రీమందిరం అధికార వర్గాలు నిర్ణయించాయి. రత్న భాండాగారం మరమ్మతుల పురోగతిపై ప్రత్యేక సమావేశం శనివారం ఉదయం ఆలయ కార్యాలయంలో జరిగింది. ఆలయ ప్రధాన నిర్వాహకుడు అధ్యక్షతన భారత పురావస్తు శాఖ(ఏఎస్ఐ), ఆలయ అధికారిక వర్గాలు (ఎస్జేటీఏ) మధ్య ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి భారత పురావస్తు శాఖ ఏఎస్ఐ అధికారులు, తొడా కొరాణొ, దేవులా కొరాణొ, భండార్ మేకప్ తదితర ప్రముఖ వర్గాల ప్రతినిధులు హాజరయ్యారు. రథయాత్ర వరకు రత్న భాండాగారం మరమ్మతుల పనులు నిలిపివేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈనెల 29 నుంచి జూన్ 27 వరకు స్వామివారి వివిధ ఆచారాల కారణంగా పనులు నిలిపివేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. రత్న భాండాగార్ మరమ్మతుల పనులు దాదాపు పూర్తయ్యాయి. గ్రానైట్ ఫ్లోరింగ్ పని మాత్రమే మిగిలి ఉంది. ఇప్పటివరకు 277 రాళ్లను అమర్చారు. వీటిలో రత్న భాండాగారం లోపల 148, వెలుపల 115 రాళ్లను అమర్చినట్లు తెలిపారు.

క్లుప్తంగా

రెడ్‌క్రాస్ శిక్షణ శిబిరం ప్రారంభం



ప్రకృతి వైపరీత్యాల సమయంలో బాధితులను రక్షించే విధానంపై శిక్షణ

జయపురం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం రాష్ట్రస్థాయిలో మూడు రోజుల జూనియర్ రెడ్ క్రాస్ శిక్షణ శిబిరం ప్రారంభించారు. సెమిలిగుడ బ్లాక్ విద్యాధికారి చమేలి ముజుందార్ అధ్యక్షతన శిక్షణ శిబిరం నిర్వహించారు. ఉపాధ్యాయురాలు నివేదిత మహోదయ అతిథులకు స్వాగతం పలికి శిక్షణ శిబిరం ప్రాధాన్యతను వివరించారు. ఈ శిబిరంలో వివిధ ప్రాంతాల నుంచి 51 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. రెడ్‌క్రాస్ అధికారి హరికృష్ణ మహరాణ జూనియర్ రెడ్ క్రాస్ శిక్షకులకు రెడ్ క్రాస్ చరిత్ర, ప్రాథమిక చికిత్స ప్రాధాన్యం, ట్రాఫిక్ నియమాలు, వివిధ సమాజ సేవా కార్యక్రమాలు వివరించారు. గౌరవ అతిథిగా రాష్ట్ర జూనియర్ రెడ్‌క్రాస్ అధికారి లక్ష్మణ స్వైఁ, కొరాపుట్ జిల్లా జూనియర్ రెడ్ క్రాస్ అధికారి సంజీవ కుమార్ దాస్, రెడ్‌క్రాస్ సాధన శిక్షకురాలు శుశ్మిత సాహు, రెడ్‌క్రాస్ మౌలిక సూత్రాలను వివరించారు. విద్యాలయాలలో జూనియర్ రెడ్‌క్రాస్ భూమికను తెలియజేశారు. సాధన శిక్షకులు సుజిత్ కుమార్ నాయక్ ప్రకతి వైపరీత్యాలలో జూనియర్ రెడ్‌క్రాస్ భూమికను వివరించారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్

కొరాపుట్: కొరాపుట్ జిల్లా కేంద్ర ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న అధునాతన అగ్నిమాపక యంత్రాలపై శనివారం అవగాహన కల్పించారు. ఫైర్ స్టేషన్ సిబ్బంది పలు యంత్రాలను ప్రదర్శనాత్మకంగా పని చేసి చూపించారు. జయపూర్ ఫైర్ అఫీసర్ సురేష్ చంద్ర బారిక, సిబ్బంది పాల్గొన్నారు.

కాశీనగర్‌లో కృష్ణచంద్ర గజపతి విగ్రహావిష్కరణ



కృష్ణచంద్రగజపతి నారాయణ దేవ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ ప్రదీప్ పాణిగ్రాహి

పర్లాకిమిడి: మహారాజా కృష్ణచంద్రగజపతి జయంతి పురస్కరించుకుని కాశీనగర్ ఫారెస్టు జంక్షన్ వద్ద ఆయన విగ్రహాన్ని బరంపురం ఎంపీ ప్రదీప్‌కుమార్ పాణిగ్రాహి శనివారం ఉదయం ఆవిష్కరించారు. గత కొన్నేళ్లుగా కాశీనగర్‌లో గజపతి విగ్రహాన్ని ఆవిష్కరించాలని స్థానికుల డిమాండ్ ఉంది. కాశీనగర్ ఎన్‌ఏసీ అధ్యక్షురాలు ఎం.సుధారాణి, పట్టణ బీజేపీ అధ్యక్షుడు బి.చలపతి, నళినీ పాత్రో, ఎల్.చంద్రరావు, రొక్కం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ మౌలిక సూత్రాలను పరిరక్షించాలి

శ్రీకాకుళం అర్బన్: శాస్త్రీయ సమాజ నిర్మాణానికి రాజ్యాంగ మౌలిక సూత్రాల రక్షణ అవసరమని మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ అన్నారు. శ్రీకాకుళంలోని యూటీఎఫ్ కార్యాలయంలో జనవిజ్ఞానవేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎం.గేయానంద్ అధ్యక్షతన సమావేశం వహించారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ సమావేశాలు విజయవాడలోని ఎంబీవీ కేంద్రంలో ఏప్రిల్ 26, 27లలో జరుగుతున్నాయన్నారు. ప్రజాస్వామ్యం, లౌకిక తత్వం, స్వావలంబన, సామాజిక న్యాయం, ఫెడరలిజంలపై జరుగుతున్న దాడిని ప్రజా సైన్స్ ఉద్యమం ద్వారా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పీడీఎఫ్ పూర్వ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు, మాజీ పీడీఎఫ్ ఎమ్మెల్సీల ఫ్లోర్ లీడర్ విఠపు బాలసుబ్రమణ్యం, ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్ (ఏఐపీఎస్‌ఎన్) కార్యవర్గ సభ్యులు జి.మురళీధర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్ర రామారావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.త్రిమూర్తులు రెడ్డి, వైస్ నాగేశ్వరరావు, రాష్ట్ర కోశాధికారి రాజశేఖర్ రాహుల్, ఎడ్యుకేషన్ సబ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ గొంటి గిరిధర్, సమత రాష్ట్ర కన్వీనర్ జి.నిర్మల, సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ సీహెచ్.జయప్రకాష్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డాక్టర్ ఖలీషా బాషా, బి.మాణిక్యం శెట్టి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణచంద్ర గజపతి చిరస్మరణీయులు

మార్కెట్ జంక్షన్ వద్ద శ్రీకృష్ణచంద్రగజపతి నారాయణ దేవ్‌కు పూలమాలలు వేస్తున్న ఎం.పి. ప్రదీప్ కుమార్ పాణిగ్రాహి, పక్కన బిజేపీ నాయకులు ఛిత్రి సింహాద్రి





మృదంగం వీధివద్ద మహారాజా సమాధి వద్ద నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ బిజయకుమార్ దాస్

పర్లాకిమిడి: మహారాజా శ్రీకృష్ణచంద్రగజపతి నారాయణ దేవ్ 134 వ జయంతి వేడుకలు పట్టణంలో మార్కెట్, చిత్రకారవీధి జంక్షన్ వద్ద ఘనంగా జరిగాయి. బరంపురం ఎంపీ డాక్టర్ ప్రదీప్ కుమార్ పాణిగ్రాహి ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆయన స్మృతి చిహ్నం వద్ద పుష్పాంజలి అర్పించారు. అలాగే కలెక్టర్ బిజయకుమార్ దాస్, పురపాలక ఈఓ లక్ష్మణ మురుమ, సరస్వతీ శిశు మందిర్ ఉపాధ్యాయులు ఆయన మూర్తికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పురపాలక సంఘం కార్యాలయంలో చైర్మన్ నిర్మలా శెఠి మహారాజా విగ్రహానికి పూలమాలలు వేశారు. స్థానిక మృదంగం వీధి వద్ద ఉన్న కృష్ణచంద్రగజపతి సమాధి వద్ద గజపతి వంశీయురాలు కల్యాణి దేవి గజపతి తొలుత పుష్పమాలలు వేసి స్మరించారు.

కృష్ణచంద్ర గజపతి నారాయణదేవ్ సేవలు అనిర్వచనీయం

పర్లాకిమిడి: ప్రత్యేక ఒడిశా కోసం పర్లాకిమిడి మహారాజా కృష్ణచంద్రగజపతి నారాయణ దేవ్ చేసిన సేవలు అనిర్వచనీయం అని బరంపురం ఎంపీ ప్రదీప్ కుమార్ పాణిగ్రాహి అన్నారు. కలెక్టరేట్ వద్ద గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం హాలులో కృష్ణచంద్రగజపతి 134 జయంతి వేడుకలపై జరిగిన సాధారణ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒడిశా ప్రత్యేక రాష్ట్రం కోసం తన సొంత నిధులు ఖర్చుపెట్టడమే కాకుండా విలువైన సమయాన్ని వెచ్చించి ప్రత్యేక స్వతంత్ర ఒడిశా ఏర్పాటుకు పర్లాకిమిడి మహారాజా కృష్ణచంద్ర గజపతి నారాయణ దేవ్ కృషి చేశారని గుర్తు చేశారు. ఒడిశాలో ఏ



వక్తృత్వ పోటీలలో విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న ఎంపీ ప్రదీప్ కుమార్ పాణిగ్రాహి

జిల్లాకు లేని పంట పొలాలకు అనేక ఎత్తిపోత పథకాలు, ఆయకట్టలు, సాగరాలు నిర్మించారని తెలిపారు. ఇంగ్లండ్‌లోని బంకింగ్‌హామ్ ప్యాలస్ నమూనా తీసుకుని పర్లాకిమిడిలో గజపతి ప్యాలెస్‌ను నిర్మించారని అన్నారు.

కొరాపుట్‌లో..

కొరాపుట్: పర్లాకిమిడి మహరాజు కృష్ణచంద్ర గజపతి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. శనివారం కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాలో ప్రభుత్వం తరపున అధికారికంగా సభలు, సమావేశాలు నిర్వహించారు.కవులు,మేదావులు పెద్ద ఎత్తున్న నివాళులు అర్పించారు.



కొరాపుట్ జిల్లా కేంద్రం లో నివాళులు అర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ లలిటెందు రంజన్ శెఠి, ప్రముఖులు



నబరంగ్‌పూర్‌లో ప్రసంగిస్తున్న రచయిత్రి స్వర్ణలత పట్నాయక్, వేదిక మీద ఉత్కళ ప్రముఖులు



రాష్ట్ర రాజధానిలో నివాళులు అర్పిస్తున్న ఉప ముఖ్యమంత్రి కేవి సింగ్ దేవ్, సీఎల్పీ నాయకుడు రామ్‌ఖడం

జయపురంలో..

జయపురం: ప్రత్యేక ఒడిశా ఏర్పాటులో పర్లాకిమిడి మహారాజు కృష్ణ చంద్ర గజపతి భూమిక చిరస్మరణీయమని వక్తలు అన్నారు. శనివారం కృష్ణ చంద్ర గజపతి జయంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. స్థానిక లేబర్ కోలనీ కూడలి వద్ద గల కృష్ణ చంద్ర గజపతి విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఉత్కళ సమ్మిళిణీ కార్యాలయంలో పూజ్యపూజ సంసద్ అధ్యక్షుడు ఉదయ శంకర జాని అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉత్కళ సమ్మిళినీ జిల్లా అధ్యక్షుడు మదన మోహన నాయిక్ ప్రత్యేక ఒడిశా ఏర్పాటులో కృష్ణ చంద్ర గజపతి భూమికను వివరించారు. ఒడిశా ప్రథమ ప్రధాన మంత్రిగా ఆయన రాష్ట్రానికి అందించిన సేవలు వివరించారు. కార్యక్రమంలో పూజ్య పూజ



జయపురం: పర్లాకిమిడి మహారాజు విగ్రహం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న పూజ్య పూజ సంసద్, ఉత్కళ సమ్మిళనీ నేతలు

సంసద్ సలహాదారు ఇంజనీర్ కేదార్ నాథ్ బెహర, ప్రమోద్ కుమార్ రౌళొ, ఉత్కళ సమ్మిళిణీ ఉపాధ్యక్షుడు రాజేంద్ర కుమార్ గౌఢ, సాధారణ కార్యదర్శి నవీణ మదల, ఉత్కళ సమ్మిళిణీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బినోద్ మహాపాత్రో, బాలా రాయ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి పరమేశ్వర పాత్రో, మాధవ చౌధురి, కవితా సాహు, సంతోష్ కుమార్ సాహు తదితరులు పాల్గొన్నారు.

రాయగడలో..

రాయగడ: పర్లాకిమిడి మహారాజు కృష్ణచంద్ర గజపతి జయంతిని పురస్కరించుకుని శనివారం స్థానిక తృప్తి కూడలిలో గల గజపతి విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. సీనియర్ పాత్రికేయుడు అమూల్య రత్న సాహు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు మనోజ్ రౌథొ, మున్సిపాలిటీ చైర్మన్ మహేష్ పట్నాయక్ తదితరులు పాల్గొని పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. జిల్లా అదనపు కలక్టర్ రమేష్ చంద్ర నాయక్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు గజపతి అందించిన సేవలను కొనియాడారు. మున్సిపాలిటీ వైస్ చైర్మన్ శుభ్ర పండ, సెంచురియన్ డైరక్టర్ రాజేష్ పాడి, జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి బసంత కుమార్ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.



రాయగడ: సంస్కృతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న రమేష్ చంద్ర నాయక్ వేదికపై అతిథులు



రాయగడ: గజపతి విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించిన పట్టణ ప్రముఖులు

పూరీ జగన్నాథ ఆలయం భద్రత బలోపేతం

భువనేశ్వర్: పూరీ శ్రీ జగన్నాథుని దర్శనం కోసం రోజురోజుకూ ఆలయంలో పెరుగుతున్న భక్తుల తాకిడి ప్రభుత్వం, శ్రీ మందిరం పాలక వర్గానికి పెద్ద సవాలుగా మారింది. పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత పూరి జగన్నాథ ఆలయం భద్రతను బలోపేతం చేశారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ స్వతంత్ర శ్రీ మందిర్ సురక్షా వాహిని (ఎస్‌ఎస్‌ఎమ్ ఎస్‌వీ) నియమించారు. ఈ నెల 28 నాటికి ఈ వర్గం బాధ్యతలు స్వీకరించనుంది. శ్రీ మందిరం భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ చర్యని చేపట్టింది. స్వతంత్ర శ్రీ మందిర్ సురక్షా వాహినిలో ఒక కమాండెంట్, 2 మంది డిప్యూటీ కమాండెంట్లు, ముగ్గురు సహాయ కమాండెంట్లు ఉంటారు. ఒడిశా పోలీసు అదనపు డైరెక్టరు జనరల్ ఈ ప్రత్యేక బృందానికి ఈ నెల 28 లోపు విధుల్లో చేరి బాధ్యతలు స్వీకరించాలని స్పష్టమైన సూచనలు జారీ చేశారు. స్వతంత్ర శ్రీ మందిర్ సురక్షా వాహిని (ఎస్‌ఎస్‌ఎమ్ ఎస్‌వీ) కమాండెంట్‌గా తాపస్ రంజన్ దాస్ నియమితులయ్యారు. యాత్రికులు, భక్తులకు క్రమబద్ధమైన, సురక్షితమైన దర్శనం కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం దర్శన వ్యవస్థలో అనేక మార్పులు చేసేందుకు నడుం బిగించింది. స్వతంత్ర శ్రీమందిర్ సురక్షా వాహిని అనే ప్రత్యేక బృందం ఆలయ భద్రత, క్రమశిక్షణకు బాధ్యత వహిస్తుంది. బెటాలియన్‌లో అనుభవం ఉన్న పోలీసు అధికారులను మూడేళ్ల పాటు తాత్కాలికంగా డిప్యుటేషన్‌పై తీసుకువస్తారు. రాష్ట్ర సాయుధ కేడర్‌కు చెందిన ఒక కమాండెంట్, 2 మంది డిప్యూటీ కమాండెంట్లు, 3 మంది సహాయ కమాండెంట్లు, 8 మంది ఇన్‌స్పెక్టర్లు, 31 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లు, 24 మంది సహాయ సబ్ ఇన్‌స్పెక్టర్లను నియమించనున్నారు.

ఈ భద్రతా దళం ఉగ్రవాద నిరోధక కార్యకలాపాలలో నిమగ్నమై ఉంటుంది. సాధారణ భక్త జనులకు క్రమబద్ధమైన దర్శనం, శ్రీ గుండిచా ఆలయం, ప్రాకార ప్రాజెక్ట్, మౌసి మా ఆలయం యొక్క భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తుంది. ఈ బృందం ఆధ్వర్యంలో కార్యకలాపాలు నిర్వహించేందుకు లోగడ 1083 మందిని నియమించాలని ప్రతిపాదించారు. ప్రస్తుతం ఈ పరిమితిని 1,200 కంటే ఎక్కువగా విస్తరించనున్నట్లు ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం అతి త్వరలో క్రమబద్ధమైన దర్శన వ్యవస్థను అమలు చేయాలని యోచిస్తున్నందున ఈ సాయుధ భద్రతా దళ మోహరింపు ప్రాధాన్యత సంతరించుకుంటుంది.

ఉగ్రదాడి దారుణం



జయపురం: జయపురంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ ఏకతామంచ్ శ్రేణులు

కొరాపుట్: కశ్మీర్‌లో ఉగ్రదాడిని పలువురు ఖండించారు. కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాల్లో క్రిస్టియన్ సంస్థల ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, కాంగ్రెస్ కార్యకర్తలు కొవ్వొతుల ర్యాలీ చేపట్టారు.

జయపురంలో..

జయపురం: జయపురంలో వివిధ వర్గాలు నిరసన చేపట్టాయి. స్థానిక హిందూ ఏకతా మంచ్ ప్రతినిధులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ముష్కరుల దాడిని ఖండించారు. రాష్ట్రపతికి ఉద్దేశించిన జయపురం సబ్ కలెక్టర్ అక్కవరం శొశ్యారెడ్డికి, జయపురం సమితి బీడీఓ శక్తి మహాపాత్రోలకు వినతిపత్రాలు అందజేశారు. జయపురం పట్టణ కాంగ్రెస్ కమిటీ పహల్‌గాం ఘటనను తీవ్రంగా ఖండించింది. స్థానిక జిల్లా కాంగ్రెస్ భవన ప్రాంగణంలో కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. జయపురం సబ్‌డివిజన్ బొరిగుమ్మలో హిందూ ఏకతా మంచ్ ప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు.



కొరాపుట్: నబరంగ్‌పూర్ మెయిన్ రోడ్డులో మహిళా సంఘాల సభ్యుల ర్యాలీ



కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లాలో నివాళులర్పిస్తున్న కళాకారులు



కొరాపుట్: పీసీసీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్క



కొరాపుట్: నబరంగ్‌పూర్‌లో నివాళులర్పిస్తున్న క్రిస్టియన్ సంస్థల ప్రతినిధులు



కొరాపుట్: జయపూర్ మెయిన్ రోడ్డులో కొరాపుట్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయం ముందు నివాళులర్పిస్తున్న దృశ్యం

ఉపాధి వేతనదారుడు మృతి

సరుబుజ్జిలి: మండలంలోని ఇస్కలపాలెం గ్రామానికి చెందిన గుజ్జల గన్నెరాజు(67) ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్న సమయంలో శనివారం ఆకస్మికంగా మృతిచెందాడు. తోటి వేతనదారులతో కలిసి కాలువలో మొక్కలు తొలగిస్తున్న సమయంలో ఒక్కసారిగా సొమ్మసిల్లి కుప్పకూలిపోయాడు. తోటి వేతనదారులు వచ్చి సపర్యలు చేసినా అప్పటికే చనిపోయాడు. టెక్నికల్ అసిస్టెంట్ లలితమ్మ, ఫీల్డ్‌అసిస్టెంట్ శ్రీరాములు ఇచ్చిన సమాచారం మేరకు ఏపీఓ పార్వతి ఘటనా స్థలానికి వచ్చి విషయం తెలుసుకున్నారు. ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. గన్నెరాజుకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

పిచ్చికుక్క దాడిలో 10 మందికి గాయాలు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డు తిలక్‌నగర్ ప్రాంతంలో రెండు రోజులుగా పిచ్చికుక్క స్వైర విహారం చేస్తోంది. పది మందికిపైగా గాయాలపాలయ్యారు. బాధితులు పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి చేరుకుని టీకాలు వేయించుకుంటున్నారు. మున్సిపాలిటీలో కుక్కల బెడద ఇటీవల కాలంలో ఎక్కువైంది. కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో ఆచరణలోకి రావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

నరసన్నపేట: జాతీయ రహదారిపై మడపాం వంశధార వంతెనపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇచ్ఛాపురానికి చెందిన కొసరాజు అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. శ్రీకాకుళం నుంచి ఇచ్ఛాపురం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడిపోవడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. తీవ్ర గాయాలు కావడంతో హైవే అంబులెన్స్‌లో ప్రాథమిక వైద్యం అందించి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

రైలు ఢీకొని వృద్ధుడు మృతి

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం-సుర్లా రైల్వేస్టేషన్ల మధ్య శనివారం గుర్తు తెలియని రైలు ఢీకొని గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందినట్లు జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ డి.హరినాథ్ తెలిపారు. మృతుడి వయసు 55 నుంచి 60 ఏళ్ల మధ్య ఉండవచ్చని, పసుపు లాల్చీ, నీలం రంగు పువ్వులు కలిగిన లుంగీ ధరించాడని పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు. జీఆర్‌పీ ఎస్సై ఎస్‌కే షరీఫ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాగేశ్వరి గుహలపై గిరిజనుల వేడుకలు



కొండ పై నృత్యాలు చేస్తున్న గిరిజనులు



అనుచరులతో హాజరైన పొట్టంగి మాజీ ఎమ్మెల్యే పీతం పాడి



తమ కుటుంబ సభ్యులతో దర్శించుకున్న కొరాపుట్ మాజీ ఎంపీ జయరాం పంగి

కొరాపుట్: వివాదాస్పద నాగేశ్వరి గుహలపై గిరిజనుల అమ్మవారి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. శనివారం కొరాపుట్ జిల్లా నందపూర్ సమితి బల్దా గ్రామ పంచాయతీలో నాగేశ్వరి కొండ ప్రాంతం వేడుకగా మారింది. తమ ఆరాధ్య దేవతని గిరిజనులు భక్తిశ్రద్ధలతో కొలిచారు. సంప్రదాయ చైత్ర మాస పూజలు చేశారు. సుమారు 10 పంచాయతీలకు చెందిన వేలాది గిరిజనులు తరలి వచ్చారు. ఈ గుహల కింద ఉన్న బాక్సైట్‌ని తవ్వుకోవడానికి అదానీ కంపెనీకి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీనిపై పోరాటం సాగుతోంది.

అలరించిన పౌరాణిక ప్రదర్శనలు



పౌరాణిక కళాకారుడు రామకృష్ణను రజత మకుటంతో సత్కరిస్తున్న నిర్వాహకులు



మయసభ నాటకంలో ఓ సన్నివేశం

శ్రీకాకుళం కల్చరల్: పౌరాణిక కళాకారుడు మోహనరావు ప్రదర్శనలను 40 ఏళ్లుగా ఇప్పటికీ ఆదరిస్తుండటం గొప్ప విషయమని పలువురు వక్తలు కొనియాడారు. జిల్లా కేంద్రంలోని బాపూజీ కళామందిర్‌లో మహాలక్ష్మి ఆధ్యాత్మిక సామాజిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో హార్మోనియం కళాకారుడు బి.ఎ.మోహనరావు 75వ జన్మదినాన్ని పురస్కరించుకొని పలు పౌరాణిక ప్రదర్శనలు శనివారం ఏర్పాటు చేశారు. అనంతపురం జిల్లాకు చెందిన పౌరాణిక నటులు ధూపం రామకృష్ణ దంపతులను సత్కరిస్తూ 'గాన కిరీటి' బిరుదు ప్రదానం చేసి వెండి కిరీటం, దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. అనంతరం ప్రదర్శించిన కురుక్షేత్రం, రామాంజనేయ యుద్ధం, గయోపాఖ్యానం, సత్య హరిశ్చంద్ర నాటక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో పద్మశ్రీ యడ్ల గోపాలరావు, గండ్రేటి బలరాం, రిటైర్డ్ జడ్జి జి.వి.రమణ, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, నిక్కు అప్పన్న, సూర శ్రీనివాసరావు, గజల్ వాసుదేవాచారి, హైదరాబాద్‌కు చెందిన పౌరాణిక కళాకారులు కన్నేపల్లి సుబ్బారావు, ధర్మపురి గౌరీశంకర శాస్త్రి, విజయనగరం మున్సిపల్ కమిషనర్ పల్లి నల్లనయ్య, పెదపెంకి శ్రీరామ్, సాయిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యమివ్వాలి



పిరిడి పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జీవనరాణి

బొబ్బిలిరూరల్: మండలంలోని పిరిడి, పక్కి గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను డీఎంహెచ్‌వో జీవనరాణి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది అందిస్తున్న వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. గర్భిణులకు ఆపరేషన్ కాకుండా సాధారణ ప్రసవాలు చేసేందుకు ప్రాధాన్యమివ్వాలన్నారు. ఈ నెలలో నాలుగు సాధారణ ప్రసవాలు చేశామని, గత నాలుగు నెలల్లో 52 సాధారణ ప్రసవాలు చేశామని వైద్యుడు రఘువంశీ తెలిపారు.

పశువుల శాల, వరి కుప్పలు దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

నెల్లిమర్ల రూరల్: మండలంలోని వల్లూరు గ్రామంలో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో పశువుల శాల, వరి కుప్పలు దగ్ధమయ్యాయి. ఈ ఘటనపై స్థానికులు తెలిపిన వివరాలు.. స్థానిక బీసీ కాలనీ సమీపంలో చెత్త కుప్పలకు నిప్పు పెట్టడంతో.. దగ్గరలో ఉన్న పశువుల శాలకు మంటలు అంటుకొని దట్టంగా వ్యాపించాయి. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన పంచాది ఈశ్వరరావు, గాదిపల్లి సత్యంకు చెందిన ఆవుల శాలతో పాటు రెండు వరికుప్పలు దగ్ధమయ్యాయి. సుమారు రూ.లక్ష వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. స్థానికులు స్పందించి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందడంతో వారు అక్కడికి చేరుకొని పూర్తి స్థాయిలో మంటలను అదుపు చేశారు. రెవెన్యూ సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి బాధితుల వివరాలు సేకరించారు.

'అంగన్‌వాడీ'లను సందర్శించిన నాగాలాండ్ బృందం



పలగర కేంద్రంలో గర్భిణుల సీమంత కార్యక్రమంలో పాల్గొన్న నాగాలాండ్ బృందం సభ్యులు

బలిజిపేట: సుపోషిత పంచాయతీ పలగరలోని 2, 4 అంగన్‌వాడీ కేంద్రాలను నాగాలాండ్ బృందం సభ్యులు హబీబు మేహవుద్, లాంగ్ కుహంలు శనివారం సందర్శించారు. కేంద్రాల నిర్వహణ, మౌలిక సదుపాయాల కల్పన, బోధనకు సంబంధించి ఎటువంటి చర్యలు చేపడతారనేది ఐసీడీఎస్ పీడీ టి.కనకదుర్గ వారికి వివరించారు. కేంద్రాల్లో ఉండే టాయిలెట్లు, తాగునీటి సదుపాయం, కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారం, చిన్నారులకు అందించే మధ్యాహ్న భోజనం, గర్భిణులు, బాలింతలకు ఇచ్చే పౌష్టికాహారం తదితర వివరాలను బృందం సభ్యులు అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల ఆరోగ్యానికి సంబంధించి ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారనేది తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు గర్భిణులకు సీమంతాలు చేశారు. బలిజిపేట సీడీపీఓ సులేఖ, సూపర్‌వైజర్ పద్మ, టాటా ట్రస్టు అసోసియేట్ సూపర్‌వైజర్ పూర్ణిమ, మహిళా పోలీసు, సిబ్బంది, జాన్, తదితరులు పాల్గొన్నారు.

వేతనదారులకు రెండు బీమా పథకాలు

విజయనగరం ఫోర్ట్: ఉపాధి హామీ వేతనదారులు దురదృష్టవశాత్తు మరణించినా, ప్రమాదం కారణంగా వైకల్యం సంభవించినా బీమా రక్షణ అందించే రెండు పథకాలు అమలులో ఉన్నట్టు డ్వామా పీడీ ఎస్.శారదాదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన పథకం కింద 18 నుంచి 70 సంవత్సరాల మధ్య వయసు ఉన్న వేతనదారులు రూ.20 సంవత్సరానికి చెల్లించాలన్నారు. ఈ పథకం కింద ప్రమాదవశాత్తూ మరణించిన, లేదా పూర్తి వైకల్యం కలిగిన వారికి రూ.2లక్షలు పరిహారం పొందగలరన్నారు. పాక్షికంగా వైకల్యం పొందిన వారికి రూ.లక్ష పొందవచ్చునన్నారు. ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన కింద 18 నుంచి 50 సంవత్సరాల మధ్య వయసు వారు రూ.435 ప్రీమియం ప్రతి సంవత్సరం చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఏ కారణంగా మరణించిన వారి వారసులకు రూ.2 లక్షల పరిహారం అందుతుందన్నారు. ఈ బీమాల కోసం పోస్టాఫీస్ లేదా బ్యాంక్‌లో ఖాతా నమోదు చేసుకోవాలన్నారు. వారి ఆధార్ అనుసంధానం చేయించుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9849903737 నంబరుకు సంప్రదించాలని సూచించారు.

డీసీపీయూ పోస్టులపై.. కూటమి నేతల కన్ను

- డీసీపీయూ, బాలసదన్‌ల్లో ఉద్యోగాలు తమ వారికే ఇవ్వాలని అధికారులపై ఒత్తిళ్లు
- 23 పోస్టులకు ఇటీవల ఇంటర్వ్యూల నిర్వాహణ



స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యాలయం

విజయనగరం ఫోర్ట్: కూటమి నేతలు అధికారం ముసుగులో అధికారులపై దర్పం ప్రదర్శిస్తున్నారు. ప్రభుత్వ పథకాలు, పోస్టులను తమ వారికే కట్టబెట్టాలని అధికార యంత్రాంగంపై తీవ్ర ఒత్తిళ్లు చేస్తున్నట్టు సర్వత్రా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే మినీ గోకులాలు, యంత్ర పరికరాలు అధికార పార్టీకి చెందిన వారికే ఇచ్చారనే గుసగుసలు ఉన్నాయి. గ్రామ పంచాయతీల్లో చేపట్టాల్సిన సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజీ పనులు సర్పంచ్‌లు చేపట్టాల్సి ఉన్నప్పటికీ సర్పంచ్‌లతో సంబంధం లేకుండా టెండర్ విధానంలో కూటమికి చెందిన నేతలకు కట్టబెట్టి వారితో పనులు చేయిస్తున్నారు. తాజాగా స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో ఉద్యోగాలను కూడా తమ వారికే ఇవ్వాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో ఒత్తిళ్లు ఎక్కువ కావడంతో అధికారులకు ఏమి చేయాలో పాలుపోక తలలు పట్టుకుంటున్నారు.

23 పోస్టులకు నోటిఫికేషన్

స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పరిధిలో డీసీపీయూ (జిల్లా బాలల సంరక్షణ విభాగం), బాలసదన్‌ల్లో ఖాళీల భర్తీకి 2024 సెప్టెంబర్ 4వ తేదీన 23 పోస్టులకు నోటిఫికేషన్‌ను స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు విడుదల చేశారు. ఈ పోస్టుల కోసం 640 మంది దరఖాస్తు చేసుకున్నారు. డీసీపీయూ పోస్టు కోసం 129 మంది, డీఈఓ పోస్టు కోసం 218 మంది, సోషల్ వర్కర్ పోస్టు కోసం 55 మంది, స్టోర్ కీపర్ పోస్టు కోసం 107 మంది, కుక్ పోస్టు కోసం 36 మంది, హౌస్ కీపర్ పోస్టు కోసం 12 మంది, నైట్ వాచ్‌మెన్ పోస్టు కోసం 17 మంది, ఎడ్యుకేటర్ పోస్టు కోసం 28 మంది, మ్యూజిక్ టీచర్ పోస్టు కోసం 25 మంది, యోగా టీచర్ పోస్టు కోసం 12 మంది దరఖాస్తు చేసుకున్నారు.



ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న ఐసీడీఎస్ అధికారులు (ఫైల్)

మా వారికే ఇచ్చేయండి..

23 పోస్టులకు ఇటీవల స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు ధ్రువపత్రాల పరిశీలన, ఇంటర్వ్యూలు నిర్వహించారు. అయితే ఈ పోస్టులపై కన్నేసిన కూటమి నేతలు తమ వారికి ఆ పోస్టులను కట్టబెట్టాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్టు పెద్ద ఎత్తున ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధి బంధువు ఒకరు ఓ జాబితాను స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులకు పంపించి వారికే పోస్టులు కట్టబెట్టాలని హుకుం జారీ చేసినట్టు విమర్శిలున్నాయి. అధికార పార్టీకి చెందిన వారు ఇచ్చిన జాబితాలో అర్హత లేని అభ్యర్థులు ఉన్నట్టు సమాచారం. అర్హత లేకపోయినా అధికార పార్టీకి చెందిన వారు కాబట్టి ఆ పోస్టులను కట్టబెట్టాలని అధికారులపై ఒత్తిడి చేస్తుండడంతో ఈ పోస్టుల భర్తీ చేసేది ఎలా? అని అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

> **పారదర్శకంగానే..**
> డీసీపీయూ, బాలసదన్ పోస్టుల భర్తీకి సంబంధించి సిఫార్సులు అనేవి నా దృష్టికి రాలేదు. పోస్టులను నిబంధనల ప్రకారం పారదర్శకంగానే భర్తీ చేస్తాం.
> – రుక్సానా సుల్తానా బేగం, పీడీ, ఐసీడీఎస్

వితంతువులందరికీ పింఛన్లు ఇవ్వాలి

- మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



మాట్లాడుతున్న పీడిక రాజన్నదొర

సాలూరు: వితంతు పింఛన్ల మంజూరు విషయంలో కూటమి ప్రభుత్వం వ్యత్యాసాలు చూపిస్తుందని, మానవత్వంతో ఆలోచించి అర్హులైన వారందరికీ వెంటనే మంజూరు చేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు పీడిక రాజన్నదొర కోరారు. పట్టణంలోని తన స్వగృహంలో విలేకరులతో శనివారం మాట్లాడారు. డిసెంబరు 2023 నుంచి అక్టోబరు 2024 మధ్యలో భర్తకు పింఛన్ అందుతూ మృతి చెందిన సదరు పింఛన్‌దారుల భార్యలు మాత్రమే పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవాలని కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఆయన తప్పుబట్టారు. 60 సంవత్సరాల వయసు దాటి పింఛన్ తీసుకుంటున్న భర్త మరణిస్తే వారి భార్యలకు పింఛన్ అందిస్తామంటున్నారని, అంతకంటే చిన్న వయసులో ఉన్న భర్తలు మరణించిన భార్యలకు వితంతు పింఛన్ మంజూరు చేయకపోతే ఆ కుటుంబం పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. కనీసం వారికి అమ్మకు వందనం, చేయూత వంటి పథకాలు కూడా నేడు రావడం లేదని వారి కుటుంబ పోషణ ఎలా అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మానవత్వంతో ఆలోచించి అర్హులైన వితంతువులకు పింఛన్లు మంజూరు చేయాలని కోరారు.

బాసంగి గదబవలసలో ఏనుగులు



బాసంగి గదబవలస పంట పొలాలలో ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని బాసంగి పంచాయతీ గదబవలస, గవరమ్మపేట పంచాయతీ వెంకటరాజపురం పంట పొలాలలో ఏనుగులు శనివారం ఉదయం దర్శనమిచ్చాయి. చాలా రోజుల నుంచి పరిసర గ్రామాలలోని పంట పొలాలలో తిరుగుతూ రాత్రి సమయాన గ్రామంలోకి చొచ్చుకువస్తున్నాయని గ్రామస్తులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. గ్రామాన్ని ఆనుకొని అరటి, పామాయిల్ తోటలతో పాటు వరి పంట ఉండడంతో గ్రామాన్ని వీడడం లేదు. పుష్కలంగా పంటలు, తాగునీరు ఉండడం వల్లే గ్రామాన్ని విడిచిపెట్టడం లేదని రైతులు వాపోతున్నారు. చేతికందుతున్న పంట ధ్వంసం కావడంతో ఏమి చేయాలో తోచడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దూర ప్రయాణాలకు వెళ్లి రాత్రి సమయాన ఇళ్లకు రావడం కష్టంగా ఉందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రామతీర్థంలో జనసేన – టీడీపీ నాయకుల కొట్లాట



గాయాలతో జనసేన నాయకుడు పైడిరాజు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని రామతీర్థం గ్రామంలో శుక్రవారం రాత్రి టీడీపీ, జనసేన నాయకులు పరస్పర కొట్లాటకు దిగారు. ఈ ఘటనపై ఇరు వర్గాలకు చెందిన బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జనసేన పార్టీ నేతగా వ్యవహరిస్తున్న పైడిరాజు ఇటీవల తన పొలంలో ఉన్న తాటి చెట్లను తొలగించారు. తన భూమి పరిధిలో ఉన్న చెట్లను సమాచారం ఇవ్వకుండా ఎందుకు తొలగించావని టీడీపీ నాయకుడు తాడ్డి సత్యనారాయణ జనసేన నేత పైడిరాజు ఇంటికి వెళ్లి ప్రశ్నించాడు. ఈ క్రమంలో ఇరువర్గాలు ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. ఈ కొట్లాటలో ఇద్దరికీ గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేరారు. దీనిపై ఎమ్మెల్సీ నమోదు కాగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రాజీ కుదిర్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. కాగా జనసేన నాయకుడు పైడిరాజు మాట్లాడుతూ గతంలో తన భూమి పరిధిలో ఉన్న చెట్లను కూడా తొలగించారని, కేవలం రాజకీయంగా తన ఎదుగుదల చూడలేకే తనపై దాడి చేశారని తెలిపాడు.

వికసిత పార్వతీపురమే లక్ష్యం

- 20 సూత్రాల అమలపై సమీక్ష సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంక దివాకర్

పార్వతీపురంటౌన్: వికసిత పార్వతీపురం జిల్లాగా రూపుదిద్దడమే లక్ష్యమని 20 సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంక దినకర్ స్పష్టం చేశారు. జిల్లాలో కేంద్ర ప్రాయోజిత పథకాలు, ప్రాజెక్టుల అమలు పురోగతి, మౌలిక సదుపాయాలకు సంబంధించిన అంశాలపై కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్‌తో కలిసి అధికారులతో కలెక్టరేట్‌లో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ సంకల్పం వికసిత్ భారత్-2047 ధ్యేయంగా నిర్వహించే కార్యచరణ ద్వారానే జిల్లా అభివృద్ధి సాధ్యమన్నారు. జిల్లాలోని అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.

- ఉపాధి హామీ పథకంలో రూ.322.75 కోట్ల చెల్లింపులు జరిగాయి. జల్‌జీవన్ మిషన్ పథకం కింద 2,313 పనులను రూ. 289.74 కోట్లతో ప్రారంభించి 85,002 గృహాల్లో 46,984 గృహాలకు తాగునీటి కుళాయిలు బిగించాం.
- జిల్లాలో 476 గ్రామాలకు సంబంధించి 428 కిలోమీటర్ల మేర రహదారుల అనుసంధానం కావాలి. పీఎం గ్రామీణ సడక్‌యోజన కింద 154 గ్రామాలను రహదారులతో అనుసంధానం లక్ష్యం.
- టిడ్కోగృహాలకు సంబంధించి సాలూరులో 1,440 గృహాలకు 1056 గృహాలు, పార్వతీపురంలో 1,104 టిడ్కో గృహాలకు 768 గృహాలను లబ్ధిదారులకు అప్పగించాం.
- పీఎంకుసుమ్ పథకం ద్వారా 115.87 ఎకరాల భూమిని గుర్తించి 25.75 మెగావాట్ల సామర్థ్యం లక్ష్యంగా పెట్టుకున్నాం.
- పీఎం శ్రీనిధి పథకం ద్వారా జిల్లాలో 148 మందికి సబ్సిడీ రుణాలు మంజూరు చేశాం.
- జిల్లాలో పర్యాటక అభివృద్ధికోసం 11 జలపాతాలను, మూడు రిజర్వాయర్లను గుర్తించామని వెల్లడించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ సబ్‌కలెక్టర్ ధర్మచంద్రారెడ్డి, డీఆర్‌ఓ హేమలత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గిన్నిస్ బుక్‌లో చోటు



గిన్నిస్‌బుక్ పార్టిసిపేషన్ సర్టిఫికెట్ అందుకుంటున్న ప్రిన్సిపాల్, విద్యార్థి

డెంకాడ: మండలంలోని పెదతాడివాడ వద్ద ఉన్న మెర్సీమిషన్ పాఠశాల ప్రిన్సిపాల్ కె.కిరణ్‌బాబు, విద్యార్థిని కె.కెరెన్ జాస్పర్‌కు గిన్నిస్‌బుక్‌లో చోటు దక్కింది. కీబోర్డు వాయిద్యంలో 45 నిమిషాల నిడివి గల వీడియో చేసి చోటు దక్కించుకున్నట్టు ప్రిన్సిపాల్ శనివారం తెలిపారు. విజయవాడకు చెందిన హల్లెల్ మ్యూజిక్ స్కూల్ వ్యవస్థాపకుడు పాస్టర్ అగస్టీన్ దండంగి ఇన్‌స్టాగామ్ సోషల్ మీడియాలో 18 దేశాలకు చెందిన 1090 మంది కీ బోర్డు వాయిద్యంలో 45 నిమిషాల విడివి ఉన్న సరళీ స్వరాల వీడియోను అప్ లోడ్ చేశారు. గత ఏడాది డిసెంబర్ 1న గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు కోసం వీటిని అప్‌లోడ్ చేశారు. వీటిలో 1046 చోటు సంపాదించుకున్నాయి. వీరిలో మెర్సీమిషన్ పాఠశాలకు చెందిన ప్రిన్సిపాల్ కె.కిరణ్‌బాబు, 4వ తరగతి విద్యార్థిని కె.కెరెన్ జాస్పర్ చోటు సంపాదించుకోవడంతో విజయవాడలో ఈ నెల 25వ తేదీన జరిగిన కార్యక్రమంలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు పార్టిసిపేషన్ సర్టిఫికెట్‌ను అందుకున్నారు.

ట్రాఫిక్ సిబ్బందికి సమ్మర్ కిట్ల పంపిణీ

- వేసవి దృష్ట్యా పని వేళల తగ్గింపు : ఎస్పీ



పోలీస్‌స్టేషన్‌లో ట్రాఫిక్ సిబ్బందికి సమ్మర్ కిట్లను పంపిణీ చేస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్ : ఎండ వేడి, తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు ట్రాఫిక్ సిబ్బందికి ఎస్పీ వకుల్ జిందల్ కిట్లను పంపిణీ చేశారు. నగరంలోని పద్మావతీ నగర్‌లో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం మధ్యాహ్నం 18 మంది ట్రాఫిక్ సిబ్బందికి వాటర్ బాటిల్, హేట్, చిన్న బ్యాగ్‌ను ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా సిబ్బంది పని వేళలను తగ్గిస్తున్నట్టు ప్రకటించారు. ఎండ తీవ్రతతో ట్రాఫిక్ సిబ్బంది ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మీరు సక్రమంగా పని చేస్తే నగరం ప్రశాంతంగా ఉంటుందన్నారు. ఎండ వేడిలో ట్రాఫిక్ సిబ్బంది పడుతున్న ఇబ్బందుల నుంచి ఉపశమనం కలిగించేందుకు పని వేళలను తగ్గించినట్టు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్, ట్రాఫిక్ సీఐ సూరినాయుడు, ఎస్ఐలు భాస్కర్, రవి, రమణ, నూకరాజు, ఏఎస్ఐ రాజు, పీసీలు భాస్కర్, రవి, నాయుడు, కిరణ్ పాల్గొన్నారు. కాగా మొత్తం 80 మందికి కిట్లు అందజేశారు. ప్రముఖ వ్యాపార, సేవా సంస్థలైన గోవిందా జ్యూయలర్గీ, రోటరీ క్లబ్ వారి సహకారంతో వీటిని పంపిణీ చేశారు.

మాదక ద్రవ్యాల జోలికి పోవద్దు... : ఎస్పీ



యువ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్ : మాదక ద్రవ్యాల జోలికి యువత పోవద్దని బంగారం లాంటి జీవతాన్ని పాడుచేసుకోవద్దని ఎస్పీ వకుల్ జిందల్ యువతకు విజ్ఞప్తి చేశారు. కలాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ యూత్ ఎక్సలెన్స్, చేయూత ఫౌండేషన్ సొసైటీ ఆధ్వర్యంలో నగరంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డ్రగ్స్ ఉపయోగం వలన కేరిర్ ఎలా పాడవుతుంది, మానవ జీవితాలు ఎలా నాశనం అవుతాయో అన్న దానిపై ప్రజలలో చైతన్యం తెచ్చేందుకు సంకల్పం కార్యక్రమం చేపట్టామన్నారు. యువత ఒకసారి డ్రగ్స్‌కు అలవాటు పడితే దాని ప్రభావం ఎంతవరకు దారి తీస్తుందో తెలియని మైకంలో పడతారన్నారు. కన్నవారి ఆశలను తెంచేవారవుతారని ఎస్పీ హితబోధ చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ మాజీ చైర్మన్, రాష్ట్ర ప్రభుత్వ డిఫెన్స్ ఎస్టాబ్లిష్‌మెంట్ సలహదారు డా.సతీష్‌రెడ్డి మాట్లాడుతూ మన భారతదేశం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ప్రపంచ దేశాల కంటే ముందున్నదని నేటి యువతరం ఆ అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. తద్వారా భారత రక్షణ రంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్లే బాధ్యత యువతపైనే ఉందన్నారు. అబ్దుల్ కలాం స్ఫూర్తితో 2045 నాటికి వికసిత భారత్ కలను నిజం చేయాలని కోరారు. యువ సమ్మేళంలో ఆర్టీఓ దాట్ల కీర్తి, ఎండీ కలీయుల్లా షరీఫ్, రవీంద్రరెడ్డి, చేయూత ఫౌండేషన్ అధ్యక్షుడు రాము లెండి, రఘు, సీతం కళాశాలల ప్రొఫెసర్లు, పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్నారు.

ఈవీఎం గోదామును తనిఖీ చేసిన కలెక్టర్



ఈవీఎం గోదాముల వద్ద రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం టౌన్: పార్వతీపురం పట్టణ పరిధిలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో గల ఈవీఎం గోదాములను కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తనిఖీ చేశారు. నెలవారీ తనిఖీల్లో భాగంగా శనివారం ఆయన గోదాములను సందర్శించి అక్కడ పరిస్థితిని గమనించారు. గోదాములకు వేసిన సీల్డ్‌లను ఈవీఎంల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్లును పరిశీలించారు. అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్‌లో సంతకం చేశారు. గోదాముల వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశిస్తూ ఏర్పాట్లుపై పరిశీలించి అధికారులకు పలు సూచనలు, మార్గదర్శకాలు జారీ చేశారు. ఆయన వెంట డీఆర్‌ఓ హేమలత తదితరులు ఉన్నారు.

డీఈఈ సెట్ నోటిఫికేషన్ విడుదల

- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- మే 8వ తేదీ తుది గడువు
- జూన్ 2, 3 తేదీల్లో పరీక్ష

విజయనగరం అర్బన్: ఉపాధ్యాయ శిక్షణ కోర్సులో ప్రవేశించేందుకు ఉద్దేశించిన డిప్లమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీ డీఈఈ సెట్-2025) నోటిఫికేషన్ విడుదలైంది. 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం పట్టణంలో ఉన్న డైట్ కళాశాలతో పాటు కొన్ని ప్రైవేట్ కళాశాలల్లో కూడా ప్రవేశాలు పొందవచ్చు. జూన్ 2, 3 తేదీల్లో ఆన్‌లైన్‌లో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు.

ఆన్‌లైన్‌లో ప్రవేశ పరీక్ష ఫీజు చెల్లింపులు

డీఈఈ సెట్-2025కు దరఖాస్తు చేసుకునేందుకు రూ.750 పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంది. ఈ నెల 22 నుంచి మే 7వ తేదీ వరకు ఆసక్తి, అర్హత ఉన్న వారు ఆన్‌లైన్‌లో పరీక్ష ఫీజును చెల్లించవచ్చు. సీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్ లేదా ఏపీడీఈఈసెట్.ఏపీఈఎఫ్ఎస్ఎస్.ఇన్ ద్వారా ఈ నెల 23వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లా పరిధిలోని పరీక్ష కేంద్రాలను కేటాయిస్తారు.

ప్రవేశ పరీక్షకు అర్హతలివే...

దరఖాస్తుదారులకు ఈ ఏడాది సెప్టెంబర్ ఒకటో తేదీ నాటికి 17 ఏళ్లు నిండి, భారత జాతీయుడై ఉండాలి. పదో తరగతితో పాటు, ఇంటర్మీడియట్ లేదా తత్సమాన ఉత్తీర్ణత సాధించాలి. ఇంటర్‌లో 50 శాతం మార్కులు రావాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు 45 శాతం మార్కుల అర్హత ఉండాలి. ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణతకు ఓసీ, బీసీ అభ్యర్థులు 35 శాతం, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు 25 శాతం మార్కులు సాధిస్తే సరిపోతుంది. ఇంటర్మీడియట్ ఒకేషనల్ కోర్సులు చదివిన వారు ప్రవేశ పరీక్ష రాసేందుకు అనర్హులు.

మార్కుల కేటాయింపు ఇలా...

గణితం, ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్, సోషల్ స్టడీస్‌కు ఒక్కో బ్రాంచ్‌కు 25 శాతం వంతున సీట్లు కేటాయిస్తారు. 6 – 10వ తరగతుల వరకు ఉన్న సిలబస్‌పై ప్రశ్నపత్రం ఉంటుంది. 100 మార్కులకు ఆన్‌లైన్ తరహాలో 2.30 గంటల పాటు పరీక్ష ఆన్‌లైన్‌లో రాయాల్సి ఉంటుంది. పార్ట్-ఏ 60 మార్కులు, పార్ట్-బీ 40 మార్కులకు ప్రశ్న పత్రం ఉంటుంది. పార్ట్-ఏ లో టీచింగ్ ఆప్టిట్యూడ్, జనరల్ నాలెడ్జ్, ఇంగ్లిష్, తెలుగులో ఐదేసి మార్కుల వంతున, ఎంచుకున్న భాష, గణితం, జనరల్ సైన్స్, సోషల్ స్టడీస్‌కు సంబంధించి ఒక్కో సబ్జెక్టుకు 10 మార్కుల వంతున మొత్తం 60 ప్రశ్నలు వస్తాయి. పార్ట్-బీలో అభ్యర్థి ఎంచుకున్న ప్రధాన సబ్జెక్టు నుంచి 40 ప్రశ్నలు 40 మార్కులకు వస్తాయి.

డీఈఈ సెట్ పరీక్షకు ముఖ్యమైన తేదీలు	
ఫీజు చెల్లింపు :	మే 5వ తేదీ వరకు
దరఖాస్తుల ఆన్‌లైన్ స్వీకరణ:	మే 8వ తేదీ వరకు
హాల్ టిక్కెట్ డౌన్‌లోడ్ :	మే 20వ తేదీ తరువాత
పరీక్ష తేదీలు :	జూన్ 2, 3
ఫలితాల ప్రకటన :	జూన్ 10

పహల్గాం ఉగ్రదాడితో అలెర్ట్

- రాష్ట్ర హోం మంత్రిత్వ శాఖ నుంచి ఎస్పీలకు ఆదేశాలు
- జిల్లా వ్యాప్తంగా పోలీసుల జల్లెడ

విజయనగరం క్రైమ్,: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్ర దాడి తర్వాత హోం శాఖ అప్రమత్తమైంది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆదేశాలతో అన్ని రాష్ట్రాల హోం మంత్రులతో భేటీ అయ్యింది. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల ఎస్పీలకు ఆదేశాలు వెలువడ్డాయి. పాకిస్తానీయులు ఎవ్వరైనా మీమీ జిల్లాల్లో ఉన్నట్లయితే తక్షణమే స్థానికతను విడిచిపెట్టి వెళ్లాలని ఆదేశాలు వచ్చాయి. ఈ మేరకు విజయనగరం జిల్లా వ్యాప్తంగా ఎస్పీ వకుల్‌జిందల్ ఏరివేతపై మౌఖిక పరమైన ఆదేశాలు ఇచ్చారు. స్థానికత ఆధారంగా ఆధార్ కార్డ్‌తో పోల్చి పాకిస్తానీయులను గుర్తించాలని సిబ్బందికి సూచించారు. ఇంటిలిజెన్స్, కౌంటర్ ఇంటలిజెన్స్ శాఖ అధికారులతో ఎస్పీ ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ నేపథ్యంలో నేషనల్ సిటిజన్ కార్డ్ సహాయంతో పాకిస్తానీయులెవ్వరెవ్వరు ఉన్నారన్నదీ జల్లెడ పడుతున్నారు. ఎస్పీ ఉత్తర్వులతో జిల్లా వ్యాప్తంగా ఉన్న 34 పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో పాకిస్తానీయుల వివరాల కోసం పని మొదలుపెట్టారు. విజయనగరంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో స్విట్జర్లాండ్‌కు చెందిన ఒకరు మాత్రమే ఉన్నట్టు వన్ టౌన్ సీఐ శ్రీనివాస్ చెప్పారు.

జిల్లాలో పాకిస్తానీయులెవ్వరూ లేరు

పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా జల్లెడ పట్టామని ఎస్పీ వకుల్ జిందల్ స్పష్టం చేశారు. కేంద్ర హోం శాఖ నుంచి ఉత్తర్వులు వచ్చాయన్నారు. ఇంటలిజెన్స్, కౌంటర్ ఇంటలిజెన్స్‌తో వెతుకులాట చేపట్టామన్నారు. అయితే పాకిస్తాన్‌కు చెందిన ఏ ఒక్కరూ జిల్లాలో లేరని ఎస్పీ వకుల్ జిందల్ వెల్లడించారు.

కన్నవారిపైనే కర్కశం





పొలంలో పడి ఉన్న అప్పలనాయుడు, జయమ్మ మృతదేహాలు

పూసపాటిరేగ: పూసపాటిరేగ మండలం రెల్లివలస గ్రామానికి చెందిన పాండ్రింకి అప్పలనాయుడు(55), జయమ్మ(53)ది సన్నకారు రైతు కుటుంబం. తమకున్న 80 సెంట్లు భూమే వారి జీవనాధారం. అందులో నాలుగు రకాల పంటలు సాగుచేస్తూ.. మరోవైపు కూలి పనులు చేస్తూ ఇద్దరు పిల్లలను సాకారు. పిల్లలే సర్వస్వంగా భావించారు. కుమార్తె రాధకు పెళ్లిచేశారు. కుమారుడు రాజశేఖర్ యుక్త వయసుకు రావడంతో మురిసిపోయారు. ట్రాక్టర్ డ్రైవింగ్ నేర్చుకోవడంతో కుటుంబ పోషణకు ఇబ్బంది లేదనుకున్నారు. కుమారిడిని కూడా ఓ ఇంటి వాడిని చేశారు. జీవితం సాఫీగా సాగిపోతుందనుకున్న సమయంలో ఇద్దరు పిల్లలకు తల్లి అయిన కుమార్తె రాధ అకారణంగా మృతిచెందింది. కుమారుడు వ్యసనాలకు బానిసగా మారాడు. అప్పులపాలయ్యాడు. రాధకు వివాహ సమయంలో ఇచ్చిన 20 సెంట్లు భూమిని లాక్కుని విక్రయించేందుకు సిద్ధపడ్డాడు. దీనిని ప్రశ్నించిన తల్లిదండ్రులను పొలంలోనే ట్రాక్టర్‌తో శనివారం సాయంత్రం గుద్దించి హతమార్చాడు. ఈ హృదయ విదారక ఘటనతో రెల్లివలస గ్రామస్తులు కన్నీరుకార్చారు. ఉన్నంతలో గుట్టుగా బతికే దంపతుల పాలిట కన్నకొడుకే యముడయ్యాడంటూ రోదించారు. పొలంలో పడి ఉన్న మృతదేహాలను చూసి ఎంత ఘోరం జరిగిపోయిందంటూ నిట్టూర్చారు.